పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కాంగ్రెస్ ఓటేస్తే మూడు గంటల కరెంటే..

- పార్టీ కార్యాలయం ప్రారంభంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, అక్టోబర్ 22 : మోసపూరిత హామీలతో ప్రజల ముందుకు వస్తున్న కాంగ్రెస్‌కి ఓటేస్తే మూడు గంటలు కరెంటే ఖాయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆదివారం కడ్తాల్ మండలకేంద్రంలో ఏర్పాటు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేశారని తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలతో కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందనుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్‌బ్లాంక్ అయిందని తెలిపారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పాలకులు ప్రజలకు చేసిందేమీలేదని, వారు చెప్పే మాయామాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నాయకులకు గ్రామాలు, ప్రజలు గుర్తుకు వస్తారని... అబద్ధాల ఆరు గ్యారెంటీలతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి గ్రామాల్లో తిరుగుతున్నారని విమర్శించారు. ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి ఓటు అడగాలని సూచించారు. అనంతరం ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, రైతుబంధు సమితి మండల, గ్రామాధ్యక్షులు వీరయ్య, నర్సింహా, సర్పంచులు రవీందర్‌రెడ్డి, హరిచంద్‌నాయక్, యాదయ్య, సులోచన, లోకేశ్‌నాయక్, కృష్ణయ్యయాదవ్, భారతమ్మతోపాటు ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డిప్ బాక్సులు

కల్వకుర్తిరూరల్, అక్టోబర్ 22 : టీఎస్ ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఆర్టీసీ డీఎం శ్రీకాంత్ కోరారు. కల్వకుర్తి డిపో నుంచి దసరా పండుగ సందర్భంగా కల్వకుర్తి డిపో నుంచి హైదరాబాద్, పాలమూరు, నాగర్‌కర్నూల్, తెల్కపల్లి రూట్‌లలో ప్రత్యేకంగా బస్సులను నడిపిస్తునట్లు ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి డిపో బస్సులలో ప్రయాణించిన ప్రయాణికులు తమ టికెట్ వెనుక తమ సెల్‌ఫోన్ నెంబర్‌ను రాసి బస్టాండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లక్కీ డిప్‌లో మహిళలు, పురుషులు వేర్వేరుగా అందులో వేయాలని అన్నారు. ఈ నెల 30 వరకు లక్కీ డిప్‌లో ప్రయాణికులు తమ టికెట్లను వేయ వచ్చని కల్వకుర్తి డిపో పరిధిలోని కల్వకుర్తి బస్టాండ్, ఆమనగల్లు బస్టాండ్‌లలో లక్కీ డిప్ బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు డీఎం పేర్కొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వెల్దండ, అక్టోబర్ 22 : మండలంలోని రాచూర్‌లో యువ నాయకులు గున్నేల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాచూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 3 పోటీల్లో గెలుపొందిన విజేతలకు సింగల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్ యాదవ్, గున్నెళ్ల శ్రీనివాస్, హరికిషన్, సంతోష్ చారి బహుమతులు అందజేశారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో పీబీకేఎస్ టీం ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి సాధించింది, రెండో బహుమతి స్వచ్ఛ్ భారత్ టీం, మూడో బహుమతి రాహుల్ టీం సాధించాయి. మొదటి విజేతకు రూ. 30 వేలు, రెండో విజేతకు రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 10 వేలు నగదు అందజేశారు.

దుర్గామాత అలంకరణలో అమ్మవారు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 22 : కల్వకుర్తి మండలంలోని మార్చాల, తర్నికల్, కుర్మిద్ద, జీడిపల్లి, గుండూర్, లింగసానిపల్లి గ్రామాలతోపాటు కల్వకుర్తి పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఆలయం, పెద్దమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపాల వద్ద దేవీ శరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారు దుర్గామాత అలంకరణలో దర్శనమిచ్చారు. తర్నికల్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు కుంకుమార్చన, అన్నదానం నిర్వహించి అన్నదాన దాతలను సత్కరించారు. మార్చాలలో దుర్గా మాత మండపం వద్ద గణపతి, నవగ్రహ, దుర్గాదేవీ హోమం నిర్వహించిన అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. మండపం వద్ద ఒగ్గు కళాకారులతో దుర్గాదేవీ మహత్యాన్ని ప్రదర్శించారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు. సాయంత్రం వేళ అమ్మవారి మండపాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని బతుకమ్మ, కోలాటాలు వేస్తూ సందడి చేశారు.

మైసిగండి ఆలయంలో దుర్గాదేవీ అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

ఆమనగల్లు, అక్టోబర్ 22 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆమనగల్లు మండలంలో కనుల పండుగగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు ఆదివారం మహాదుర్గ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి వాసు, ఆర్య వైశ్య సంఘం నాయకులు కండె భాస్కర్, కండె సుమన్, కండె సాయి, సందీప్ ,ఆర్య వైశ్య సంఘం మహిళలు ఉన్నారు.

మహాలక్ష్మీ రూపంలో దుర్గామాత

ఊర్కొండ, అక్టోబర్ 22 : మహాలక్ష్మి రూపంలో దుర్గా మాత ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. మండల పరిదిలోని బోమ్మ రాజుపల్లిలో భవానీ యూత్ అధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

వెల్దండ, అక్టోబర్ 22 : ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపతిరెడ్డి , కొట్ర గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందర్‌రావు అన్నారు. ఆదివారం కొట్రలో అమ్మవారి మండపం వద్ద మహాగాయత్రి హోమం నిర్వహించి అన్నదానం చేశారు. వెల్దండ రంగనాయకి స్వామి ఆలయంలో భూపతిరెడ్డి దంపతులు, హనుమాన్ ఆలయంలో అరుణ్ దంపతులు అమ్మవారికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీరాం యూత్ సభ్యులు శ్రీశైలంయాదవ్, విష్ణుగౌడ్, దేవేందర్, అరుణ్‌కుమార్, రాజు, శ్రీను, రఘు, మల్లేష్,లక్ష్మయ్య, దీపక్, ఆర్య వైశ్య సంఘం వజ్రలింగం, పూరి రమేష్, కుమారస్వామి, పాలాది సంతోష్, సైదులు, కిరణ్, ఆంజనేయులు, రాజయ్య, శ్రీను, కృష్ణ, అనిల్‌తోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గాదేవీ అలంకరణలో..

కడ్తాల్, అక్టోబర్ 22 : మండలంలో దేవీశరన్నవరాత్రుల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని షీర్డీ సాయి బాబా ఆలయంలోని అమ్మవారు మహిషాసురమర్దినిదేవీగా, మైసిగండి గ్రామంలోని రామాలయ, శివాలయంలోని అమ్మవారు దుర్గాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన హోమంలో తాసీల్దార్ ఆర్పీ జ్యోతి, అరుణ్‌నాయక్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం అమ్మ వారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీపంతూ నాయక్, ఈవో స్నేహలత, నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌నాయక్, రాఘవేందర్, ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెల్దండలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మార్చాలలో దుర్గా హోమం చేస్తున్న స్వాములు

ఊర్కొండలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

గులాబీ జెండా ఎగరేద్దాం

కడ్తాల్, అక్టోబర్ 22 : అందరూ కలిసికట్టుగా పనిచేసి కల్వకుర్తి నియోజకవర్గంలో గులాబీజెండా ఎగరేద్దామని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని న్యామతాపూర్ కార్యకర్తల సమావేశం నిర్వహించి బూత్ కమిటీని గ్రామాధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై గ్రామాల్లో చర్చ జరపాలని పేర్కొన్నారు. 2014కి ముందు గ్రామాల పరిస్థితి ఎలా ఉంది, ప్రస్తుతం ఎలా ఉంది అనే విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రకటిస్తున్న మోసపూరిత హామీలను ఎండగట్టాలన్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు నియామాక పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, పార్టీ ఉపాధ్యక్షుడు మోతీలాల్, నాయకులు దుర్గాజీ, శివ, వెంకటేశ్, మల్లేశ్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నియామాక పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

ఘనంగా కొమురం భీమ్ జయంతి

అమ్రాబాద్ అక్టోబర్ 22 : మన్యం బిడ్డ కొమరంభీమ్ 121వ జయంతి వేడుకలను ఆదివారం పదర మండలకేంద్రంలో ఆదివాసి గిరిజన చెంచులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి వివేకానంద చౌరస్తా వద్ద కొమురంభీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆదివాసీల కోసం చేసిన సేవలను కొనియాడుతూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులుతో పాటు ఆదివాసీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఊర్కొండ, అక్టోబర్ 22 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, అదేవిధంగా క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై లెనిన్ అన్నారు. ఆదివారం మండలంలోని ఇప్పపహాడ్‌లో విజయదశమిని పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ పోటీలను సర్పంచ్ వనజాబాలస్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత అన్ని రంగాల్లో రాణించాలంటే మానసికంగా ఎంతో దృఢంగా ఉండాలని, దీనికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం సర్పంచ్ వనజ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించి గ్రామానికి, మండలానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్యగౌడ్, దుబ్బరవి, బుచ్చయ్యపాల్గొన్నారు.

పాలెంలో క్రికెట్ పోటీలు

బిజినేపల్లి, అక్టోబర్ 22: దసరా పండుగను పురస్కరించుకొని మండలంలోని పాలెంలోని రాయల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రికెట్ పోటీలకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఆటలు ఆడడంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అదేవిధంగా క్రికెట్ టోర్నమెంట్‌కి కావాల్సిన సామగ్రిని రవీందర్‌రెడ్డి, గోవింద్, శంకర్, స్వామి, బాలు అందించారు.

మద్యం స్వాధీనం

తిమ్మాజిపేట, అక్టోబర్ 22: మండలంలోని మరికల్ గ్రామంలో బెల్ట్‌దుకాణం దాడి చేసి లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ దుకాణంపై దాడి చేసి 7.7 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.